# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రతీ ఒక్కరికీ వస్తు సేవల పన్ను- జీఎస్టీ ప్రయోజనాలు దక్కాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశంకానుంది.**
3. **తెలంగాణను ఏఐలో ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ కు 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.**
5. **ఆధునిక తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందిన కవి బోయి భీమన్న జయంతి ఈ రోజు.**

=========================

ప్రతీ ఒక్కరికీ వస్తు సేవల పన్ను- జీఎస్టీ ప్రయోజనాలు దక్కాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా జీఎస్టీ 2.0 సంస్కరణలపై సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ముఖ్యమంత్రి నిన్న ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో చాలా వస్తువులు 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయన్నారు. వీటి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు అందరికీ లబ్ధి కలుగుతుందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 28 సేకన్లు

ఇదిలావుండగా జీఎస్టీ సంస్కరణల్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన తీర్మానానికి రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. దీనితో జీఎస్టీ మార్పులను స్వాగతిస్తూ దేశంలో తొలిసారి తీర్మానం చేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశంకానుంది. ఈ సందర్భంగా శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న పలు బిల్లుల గురించి మంత్రివర్గం

చర్చించి, ఆమోదం తెలపనుంది.మరోవైపు ఈ ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ వర్షాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభం కానున్నాయి. ఈ రోజు శాసన సభలో జల వనరుల శాఖపై స్వల్పకాలిక చర్చ జరగనుంది. కర్మాగారాలు, పరిశ్రమల వివాదాలు, మోటారు వాహన పన్ను, రాష్ట్ర ఎస్టీ కమిషన్, సంబంధించిన బిల్లులను సభలో ప్రవేశపెట్టనున్నారు. ముందు ఉంచనున్నారు.

--------------------------

తెలంగాణను కృత్రిమ మేధ –ఏఐలో ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోని మాదాపూర్‌లో 'యూఎక్స్ఇండియా 25' పేరిట ఏర్పాటు చేసిన మూడు రోజుల సదస్సును ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సులభంగా ఉపయోగించుకునేలా ప్రాంతీయ భాషల్లోనూ యాప్‌లను రూపొందించాలని సూచించారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ డిజైన్ క్యాపిటల్‌గా మార్చేందుకు త్వరలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్'ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

--------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. వ్యవసాయంలో అధునాతన సాంకేతికత ద్వారా కేంద్రప్రభుత్వం రైతులకోసం చేపట్టిన చర్యల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (1 : 21 )

--------------------------

ఆంధ్రప్రదేశ్ కు 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీకి రాష్ట్రంలోని గంగవరం పోర్ట్ కు యూరియా చేరుతుందని ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేటాయింపుతో రైతులకు మరింత వెసులుబాటు లభిస్తుందని ,ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

'స్వచ్ఛత హి సేవా' అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ మిషన్ కార్పొరేషన్ సంచాలకులు ఎం వెంకట రమణారావు సూచించారు. బాపట్ల జిల్లా,చీరాల రైల్వే స్టేషన్ సముదాయంలో రైల్వే అధికారులు,పారిశుధ్య సిబ్బంది 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వెంకట రమణారావు రైల్వే స్టేషన్ సముదాయాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని చెప్పారు.

--------------------------

'ఛలో జీతే హై' పేరుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాల్యం ఆధారంగా నిర్మించిన లఘు చిత్రం బాలబాలికల్లో స్ఫూర్తిని నింపుతుందని ఆంధ్రప్రదేశ్ భార తీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. విజయవాడలోని

ఓ సినిమా థియేటర్ లో 'ఛలో జీతే హై' చిత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి గత సాయంత్రం వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని నరేంద్ర మోదీ బాల్యం నుండి సమాజం తీరును గమనించారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐనాక్స్ థియేటర్లలో ఈ లఘు చిత్రాన్ని ఉచితంగా వీక్షించవచ్చని తెలిపారు. మరోవైపు విజయనగరంలో 'ఛలో జీతే హై' చిత్రాన్ని వీక్షించిన బిజేపీ నాయకలు ఆకాశవాణితో మాట్లాడుతూ...

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ఆధునిక తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందిన గొప్ప కవి బోయి భీమన్న జయంతి ఈ రోజు.పద్యం, గద్యం, నాటకం, వచన కవిత వంటి పలు సాహితీ ప్రక్రియల్లో 70 కి పైగా రచనలు చేసిన బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 19 వ తేదీన తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురులో జన్మించారు. బోయి భీమన్న రచనలలో దీప సభ కావ్యం, పాలేరు, కూలి రాజు నాటకాలు వంటి రచనలు ప్రముఖమైనవి. ఆయన రచించిన "గుడిసెలు కాలిపోతున్నాయి" రచనకు గానూ 1975 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 2005 వ సంవత్సరం డిసెంబర్ 16 వ తేదీన కన్ను మూసిన బోయి భీమన్న తెలుగు పత్రికా రంగానికి పాత్రికేయునిగా చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. కాగా బోయి భీమన్న జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అవార్డులను ఈ రోజు ప్రధానం చేస్తారు.

---------------------------

బంగాళాఖాతంలో ఈ నెల 25 తర్వాత అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న నాలుగు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి తెలియజేసారు.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================